


భారత్

# ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 302 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు మంగళవారం, 25 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 302 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR TUESDAY, 25 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




## ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ

# జోడిద్దాం

నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి

- అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు
- ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి
- దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల
- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మై పాప్ కార్నికా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మై పాప్ కార్నికా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..."

2లో..



## కాకినాడ బీచ్‌లో యువకులు గల్లంతు..

### ఆందోళన వ్యక్తం చేసిన డిప్యూటీ సిఎం పవన్

అమరావతి:కాకినాడలోని గుర్రాల బీచ్ వద్ద అలల ఉధృతి కారణంగా ఇద్దరు యువకుల గల్లంతుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల గల్లంతుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్ళు, ప్రత్యేక రెస్క్యూ బృందాలు, మెరైన్ పోలీసు, కోస్టు గార్డుతో పాటు స్థానిక మత్స్యకార సమూహాల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. ఆదివారం నలుగురు స్నేహితులు వీరబాబు, శ్రీగణెలిష్ సాయిరాం, యువ కిశోర్, ఆదిత్య వెంకట సందీప్‌కుమార్ కలిసి కాకినాడాలోని గుర్రాల బీచ్‌కు వెళ్లారు. ఎవరూ లేని ప్రదేశంలో నలుగురు కలిసి సముద్రంలో స్నానానికి వెళ్లగా అలల ఉధృతికి యువ కిశోర్, వీరబాబు గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన ఇద్దరికి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.




2లో..

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం



## దూసుకుపోతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ: అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు ప్రతిరోజు పెరుగుదల నమోదు చేస్తూనే ఉన్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,63,970గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.880 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,50,300గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.800 మేర పెరిగింది.


## శ్రీశైలం నీళ్లు ఎత్తిపోస్తుంటే ఏం చేస్తున్నారు.

నీటిని ఎత్తిపోస్తుంటే చోద్యం చూస్తున్న ప్రభుత్వం

మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి



2లో..



## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

### దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ..


దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## శాసనసభ కమిటీలకుఎంతో ప్రాధాన్యం



2లో..

- ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి
- బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి
- శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్






2లో..

## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్
- మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్

## అమెరికా టూర్ రద్దును ఊరికే

# వదలబోం

- తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర
- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు




2లో..

# అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం

హైదరాబాద్: పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడులు ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకునేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలుచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం




గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి
లక్ష్యం. తెలంగాణపై
గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది.

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం



మెదక్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్
మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# శాసనసభ కమిటీలకుఎంతో ప్రాధాన్యం

హైదరాబాద్:ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు
నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను
సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించాననన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ÷ూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం ,
సభ్యులు వెద్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం



పులివెందుల: జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు కళ్యాణ్ పత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణంఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.అప్పటి నుంచి కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# శ్రీశైలం నీళ్లు ఎత్తిపోస్తుంటే ఏం చేస్తున్నారు.

హైదరాబాద్: కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. నీటిమట్టాలు తక్కువగా ఉన్నా వివిధ ఛానళ్ల ద్వారా నీళ్లను ఎపి తరలిస్తున్నా తెలంగాణ చోద్యం చూస్తోందని అన్నారు. తెలంగాన భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు. ఒకవైపు శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 854 లెవల్‌లో గేట్లు తెరిస్తే పోతిరెడ్డి పాడు, పక్కన మల్యాల, హంద్రినీవా ఇది ఒక సిస్టమ్.. మరోవైపు అదే శ్రీశైలం ప్రాజెక్టులో 840 అడుగుల వద్దే ఒక టన్నెల్ 19.2 కిలోమీటర్ల టన్నెల్‌ను తవ్వి ముందుకు తీసుకొని పోయి రిజర్వాయర్‌ను కట్టారు. దాని పేరు నల్లమల సాగర్ అని అన్నారు. 43 టీఎంసీల యూజబుల్ వాటర్ అని వాళ్లు లెక్క చెబుతున్నరు. కానీ అది 53 టీఎంసీల రిజర్వాయర్. కట్టేశారు.. టన్నెల్స్ అయిపోయాయి. ఇప్పుడు వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ దగ్గర ఉండేట్వంటి అప్రోచ్ కెనాల్ అక్కడుండే గేట్లు తెరిస్తే చాలు.. శ్రీశైలం నీళ్లు 854 లెవల్ పోతిరెడ్డిపాడు అయిపోగానే.. శ్రీశైలం 854 లెవల్‌కు డౌన్ అయింది అంటే 840 లెవల్‌లో ఉండే వెలిగొండ రిజర్వాయర్ ద్వారా నీళ్లు తీసేస్తరు. నాలుగున్నర లక్షల ఎకరాల కోసం ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా, నెల్లూరు, కడప జిల్లా కలిపి 33 మండలాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు ఉద్దేశించినట్వంటి ఈ వెలిగొండ ప్రాజెక్టును ఆగస్టు 31న వాళ్లు ప్రారంభోత్సం చేసుకోవడానికి ఏర్పాటు చేసుకుంటున్నరు. ఎక్కడ పడుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి.. ఎక్కడున్నవ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఏం చేస్తున్నరు మీరు.. ? అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఉన్న నీళ్లు నల్లగొండకు, పాలమూరుకు ఇయ్యనీకే చేతనైతలేదు. పాలమూరు-రంగారెడ్డి తయారై ఉన్న సిస్టమ్‌ను ఆపరేట్ చేయడానికి చేతనైతలేదు మీకు.. మిగిలిన పనులు పూర్తి చేయనీకి చేతనైత లేదు. అది కూడా మనం దిగువన పెట్టిన వనరు. వాళ్లకు 854 లెవల్, 840 లెవల్ వచ్చే కంటే ముందే 802లో ఉండే సిస్టమ్‌ను వాడుకునేట్వంటి తెలివిలేని, చేతగాని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. అసమర్థత ముఖ్యమంత్రి, అసమర్థ సాగునీటి మంత్రి, జిల్లా మంత్రులకు సోయే లేదు.



## వైసీపీ హయాంలో రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్

### మద్యం పాలసీని మార్చి వేల కోట్ల రూపాయల దోపిడీ

### మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపణ

అమరావతి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో మద్యం కుంభకోణం జరిగిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. సుమారు రూ.3,500 కోట్ల లిక్కర్ స్కామ్ జరిగిందని ఆయన పేర్కొన్నారు. మద్యం పాలసీని మార్చి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. మద్యం తయారీ, రవాణా, హోలోగ్రామ్‌ల వ్యవహారాల్లో అక్రమంగా డబ్బులు సంపాదించి, వాటిని రహస్య ప్రాంతాల్లో దాచుకున్నారని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుంటే.. రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ఎదురుదాడికి దిగుతున్నారని విమర్శించారు.ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన ఆర్థిక ప్రయోజనాల కోసమే మద్యం పాలసీని రూపొందించారని విమర్శించారు. చేసిన అవినీతి, అక్రమాల నుంచి తప్పించుకునేందుకు కులాలు, మతాలను అడ్డుపెట్టుకుంటున్నారని పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్ కసిరెడ్డి వంటి సలహాదారుల సహకారంతో ఈ విధానాన్ని రూపొందించారని ఆయన ఆరోపించారు. బలహీన వర్గాలకు చెందిన నాయకులను మద్యం వ్యవహారంలో పావులుగా ఉపయోగించుకుని, చివరకు వారినే బాధ్యులను చేశారని వ్యాఖ్యానించారు.మద్యం వ్యాపారం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును విదేశాల్లో మైనింగ్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాల్లోకి మళ్లించారని పార్థసారథి ఆరోపించారు. తమపై కేసులు నమోదైతే కోర్టులపై నమ్మకం లేదంటూ, రాజకీయ కక్ష సాధింపుగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం బ్రాండ్లను రాష్ట్రంలోకి తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించారని మంత్రి ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కారుమూరి నాగేశ్వరరావు కూడా ఇరుక్కున్నారని ఆయన పేర్కొన్నారు. మద్యం రవాణా ఛార్జీల విషయంలోనూ అక్రమాలు జరిగాయని పార్థసారథి ఆరోపించారు. గతంలో రూ.13గా ఉన్న ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీని ప్రభుత్వ మద్దతుతో రూ.35కు పెంచుకుని సుమారు రూ.400 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మద్యం వ్యాపారం, రవాణా కాంట్రాక్టులకు సంబంధించిన విషయాలను కారుమూరి కుటుంబ సభ్యులే అంగీకరించారని మంత్రి పేర్కొన్నారు. మద్యం ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును కుటుంబ సభ్యులు, సంస్థలతో పాటు మహిళల బ్యాంకు ఖాతాల్లోకి కూడా మళ్లించారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో స్పష్టమైన ఆధారాలు ఉండటం వల్లే సుప్రీంకోర్టు, హైకోర్టులు కూడా కారుమూరి కుటుంబానికి బెయిల్ ఇవ్వలేదని పార్థసారథి పేర్కొన్నారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రానికి నష్టం కలిగించిన వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలకు ప్రాధాన్యం, గౌరవం ఉంటాయని పార్థసారథి అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో మద్యం బ్రాండ్ల వ్యవహారంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి పార్థసారథి కోరారు.

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో పంటలకు విలువ జోడిద్దాం

నూజివీడు: మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండపల్లి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.'ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే ఆవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రొడక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ.1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ.35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం.


భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
మంగళవారం, 25 ఆగష్టు 2026



# సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై పూర్తి నిషేధం : జిఎంసి కమిషనర్

**గుంటూరు, 24 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో ప్రజారోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై పూర్తి స్థాయిలో నిషేధం అమలులో ఉందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మయూర అశోక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్లాస్టిక్ నిషేదంపై ప్రజారోగ్య అధికారులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు నిరంతరం క్షేత్ర స్థాయిలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై 'స్వచ్ఛ యాప్' ద్వారా తక్ష ణమే అపరాధ రుసుం విధించడానికి చర్యలు తీసుకున్నా మన్నారు. ప్రజలు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టం తెలుసుకొని సహకరించాలని ఆయన కోరారు.

# గుంటూరు జిఎంసిలో ఏసీబీ దాడులు






## 156 పనుల్లో అవకతవకలు గుర్తింపు

**గుంటూరు, 24 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం ఉదయం నుంచి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విభాగంలో పది మందికి పైగా అధికారులు ఈ దాడుల్లో పాల్గొని రికార్డులను పరిశీలించారు. ఏసీబీ ఆకస్మిక తనిఖీల నేపథ్యంలో నగంపాలక సంస్థలోని ఇతర విభాగాల అధికారులు, సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. 2017 నుంచి 2025 వరకు జీఎంసీ పరిధిలో చేపట్టిన రహదారులు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైప్లాన్ల నిర్మాణ పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించామని ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ తెలియజేశారు. ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్టర్ల కు అనుకూలంగా కొంతమంది అధికారులు వ్యవహరించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. మొత్తం 156 పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని వెల్లడించారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, పైపులైన్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల్లో అక్రమాలు జరిగినట్లు తెలిపారు. 2017 నుంచి 2025 వరకు ఇంజనీరింగ్ విభాగంలో టెండర్ల పర్సంటేజీలను మార్చి అవకతవకలకు పాల్పడిన అంశంపై విచారణ కొనసాగుతోందన్నారు. ఏసీబీ తనిఖీలు మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతాయని తెలిపారు. పల్నాడు, గుంటూరు జిల్లాలు ఏసీబీ పరిధిలో ఉన్నాయని, ఎక్కడైనా అవినీతి జరిగినట్లు సమాచారం ఉంటే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# అమ్మవారి మంగళసూత్రం అపహరణపై దర్యాప్తు వేగవంతం చేయాలి



## దొంగలను వెంటనే అరెస్టు చేయాలి: అంబటి మురళీకృష్ణ

**గుంటూరు, 24 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పెదకాకాని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదిశక్తి అమ్మవారి మంగళసూత్రం అపహరణ ఘటనపై పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పవిత్ర శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం అనంతరం అమ్మవారి మంగళసూత్రం కనిపించకుండా పోయిందని తెలిపారు. వరలక్ష్మీ వ్రతం పూర్తయ్యే వరకు కూడా ఘటనపై కేసు నమోదు చేయకపోవడం దేవాలయ పాలక మండలి, పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శ నమని విమర్శించారు. భక్తులు ఫిర్యాదు చేసినప్పటికీ సకాలంలో కేసు నమోదు చేయక పోవడంతో వారి మనోభావాలు దెబ్బతిన్నాయని, దేవాలయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని పేర్కొన్నారు. పెదకాకానిలోని గంగా భ్రమ రాంబికా దేవి తాళి దొంగతనం 14వ తేదీన జరిగింది.ఆ విషయం పై విచారణ చేయాలని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసాము. 21వ తేదీన మేము ఫిర్యాదు చేసే వరకు దేవాలయ అధికారులు, కమిటీ సభ్యులు ఎవరూ కంప్లైంట్ ఇవ్వలేదు. కాకాని పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అమ్మవారి మంగళ సూత్రం దొంగతనం జరిగితే శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఎలా చేసారు. 22 వ తేదీవరకు దేవాదాయ శాఖ, ఆలయ సిబ్బంది నుంచి ఎలాంటి వివరణ రాలేదు. అమ్మవారి మంగళ సూత్రం దొంగతనం విషయం లో రాజకీయాలు చేయటం సరైన విధానం కాదు. అమ్మవారి మంగళ సూత్రం దొంగతనం అనేది భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే. భగవంతుని సేవలో ఉండే పూజారులను అర్ధరాత్రి వరకు స్టేషన్ లో ఉంచటం సరికాదు. పూజారులు తలా కొంచెం వేసుకుని తాళిబొట్టు చేయించమని పంచాయతీ



చేయటం దారుణం. అమ్మవారి తో చెలగాటం ఆడటం అంటే నిప్పుతో చెలగాటం ఆడటమే. అమ్మవారి మంగళ సూత్రం తయారు చేయించి ఇచ్చేందుకు నేనుసిద్దంగా ఉన్నాను. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కూడా ఈ ఘటనపై బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఘటన జరిగి పది రోజులు గడిచినా నిందితులను గుర్తించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. మంగళసూత్రం అపహరణకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, దేవాలయంలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు.

# అక్రమ నిర్మాణ మాఫియా బెదిరింపులు !



ఖాకీ పలుకుబడితో దౌర్జన్యాలు..
లంచాలతో టౌన్ ప్లానింగ్ నోటికి తాళం !
రవీంద్రనగర్‌లో అనుమతులు లేని అడ్డగోలు కట్టడం..
OC లేకుండానే ఏళ్ల తరబడి పన్నుల దోపిడీ
ప్రశ్నించిన సహచరుడికే 'చంపేస్తాం' అంటూ బెదిరింపులు..



## ఫోర్జరీ సంతకాలతో దొంగ దస్త్రాలు !

**గుంటూరు, 24 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగర పాలక సంస్థను తమ బానిస సంస్థగా మార్చుకుని, చట్టాలను బూట్ల కింద తొక్కుతూ బరితెగించిన అక్రమ నిర్మాణాల మాఫియా బాగోతం పట్టాభిపురం వేదికగా బట్టబయలైంది. అనుమతుల్లేని బహుళ అంతస్తుల కట్టడాలతో ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో గండి కొట్టడమే కాక, పోలీసు పలుకుబడిని అడ్డం పెట్టుకుని ప్రశ్నించిన వాటాదారుడి గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న ముఠా దాష్టీకం సోమవారం నగరపాలక సంస్థ గ్రీవెన్స్‌లో తీవ్ర కలకలం రేపింది.

**అనుమతుల్లేవు.. ఆక్యుపెన్సీ లేకుండానే దర్జాగా కాపురం !**
పట్టాభిపురం రవీంద్రనగర్‌లో ఎలాంటి అధికారిక అనుమతులు, ప్లాన్ అప్రూవల్స్, చివరకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC) లేకుండానే ఒక భారీ అక్రమ భవనాన్ని నిర్మించేశారు. గత మూడేళ్లుగా గవిని రత్న చౌదరి, గవిని భార్గవ్ రాము, ముప్పనేని మల్లికార్జునరావు, కొల్లూరు పద్మావతి, గవిని వామనమూర్తి అనే వ్యక్తులు అందులో దర్జాగా నివాసముంటూ మున్సిపల్ పన్నులను నిలువునా ఎగ్గొడుతున్నారు. కనీస పర్మిషన్ లేని కట్టడానికి మంచినీటి కనెక్షన్లు, కరెంట్ మీటర్లు ఎలా కేటాయించారో టౌన్ ప్లానింగ్ అధికారుల ముడుపుల మత్తుకు ప్రత్యక్ష నిదర్శనం.

**'లక్షలు పోసి అధికారులను కొన్నాం'.. బరితెగించిన ఖాకీ ముఠా !**
వాటాదారుల మధ్య వివాదాలు తలెత్తడంతో బాధితుడు తన ప్లాట్‌ను అమ్ముకునేందుకు యత్నించగా, ఈ ముఠా అరాచకానికి తెరలేపింది. తాము నిర్ణయించిన కారుచౌక ధరకే తమ వాళ్లకే రాసివ్వాలని బెదిరింపులకు దిగారు. బాధితుడు రాకపోకలు సాగించకుండా ఇంటి ముఖద్వారాన్ని చెక్కలతో మూసివేసి గూండాయిజం ప్రదర్శించారు. నిందితుల్లో వామనమూర్తి భార్య పోలీసు విభాగంలో పనిచేస్తుండటంతో "మమ్మల్ని ఎవడూ ఏమీ చేయలేడు..కార్పొరేషన్ అధికారులకే లక్షలు పోసి కొనేశాం" అంటూ అత్యంత అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డారు. అంతేకాక, బాధితుడి సంతకాన్ని ఫోర్జరీ చేసి దొంగ దస్త్రాలతో అనుమతుల కోసం ప్రయత్నించినట్లు బాధితుడు వాపోయారు.

**కమిషనర్‌ను మోసం చేస్తున్న కిందిస్థాయి అవినీతి తిమింగలాలు !**
కార్పొరేషన్ కమిషనర్ నిజాయితీ గల అధికారి అయినప్పటికీ, లంచాలకు మరిగిన కిందిస్థాయి సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతూ, ఫోర్జరీలు, రౌడీయిజానికి పాల్పడుతున్న ఈ ముఠాపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టి, అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేయాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యవసాయ కార్మిక సమస్యలు పరిష్కరించాలి

## డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా




**గుంటూరు, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం గుంటూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ గ్రామాల్లో మూడు సెంట్లు పట్నాలో రెండు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఐదు లక్షల రూపాయలు పెంచి ఇవ్వాలని, అన్ని రకాల ప్రభుత్వ భూములు పేదలకు కుటుంబానికి రెండు ఎకరాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూములు పేదలకు పెంచాలని, భూ సమస్యల పరిష్కరించి, 22 ఏ లో పెట్టిన పేదల ప్రభుత్వ భూములకు ఒరిజినల్ అడంగల్, వన్ బి వచ్చేలా చేసి ప్రభుత్వ నుండి అన్ని రకాల సహాయం అందించాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని విబిజి రాంజీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. అంతేకాకుండా అర్హత కలిగిన పేదలందరికీ కొత్త సామాజిక పెన్షన్లను మంజూరు చేయాలని 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ నెలకి 1500 ఇస్తామని ఇచ్చిన హామీన అమలు చేయాలని, కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వ భూముల్లో నివసించే వారికి పట్టాలను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా సమితి తరపున డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, గుర్రంకొండ సత్యానందం, తాడికొండ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, తోకల జయమ్మ, పంతగాని, మరియదాసు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బెజ వాడ, జిల్లా అధ్యక్షులు మిర్యాల కోటేశ్వరరావు, యాకోబు, జివి రాజు, శానం సుజాత, తోకల పాములమ్మ, నాగేశ్వర రావు, రత్నరాజు, స్వామి, చెవులపునయ్య, రమేష్, మరియమ్మ, లక్ష్మీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన పాఠశాల బస్సు

## గుంటూరులో తప్పిన పెను ప్రమాదం





**గుంటూరు, 24 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. బస్సు నడుపుతున్న సమయంలోనే పాఠశాల బస్సు డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో బస్సు అదుపుతప్పి విద్యుత్ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. స్థానికుల అప్రమత్తతతో పెద్ద ప్రమాదమే నివారించబడింది.

**వివరాల్లోకి వెళితే..** గుంటూరులోని SVN కాలనీ సమీపంలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు ఉదయం విద్యార్థులను ఎక్కించుకుని పాఠశాలకు బయలుదేరింది. బస్సు ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా డ్రైవర్ తీవ్రమైన గుండెనొప్పికి గురయ్యారు.నొప్పి తీవ్రతకు ఆయన బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో, బస్సు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి నిలిచి పోయింది. బస్సులో చిన్నారులు భయంతో కేకలు వేయడంతో గమనించిన స్థానికులు క్షణాల వ్యవధిలో స్పందించారు. వెంటనే అప్రమత్తమై విద్యార్థులను సురక్షితంగా బస్సు నుంచి కిందకు దించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గుండెపోటుతో అస్వస్థతకు గురైన బస్సు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్థానికులు స్పందించకపోతే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

# కులం కార్డు వెనుక అవినీతిని దాచలేరు ?

## చట్టం ముందు తప్పు చేసినవారు శిక్షార్హులే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, 24 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వైఎస్సార్సీపీ నాయకులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడారు.

**లిక్కర్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుంటోంది :** గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో జరగని అక్రమం, జరగని కుంభకోణం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు నుంచి రేషన్ బియ్యం పంపిణీ వరకు, లిక్కర్ విధానాల నుంచి ప్రభుత్వ విభాగాల వరకు ప్రతిచోటా అవినీతి రాజ్యమేలిందన్నారు. లిక్కర్ స్కామ్‌పై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేడు ఆ అక్రమాలపై విచారణ జరుగుతుండగా, చట్టం తన పని తాను చేసుకుంటోందని పేర్కొన్నారు.

**ఈడీ అరెస్టు, సుప్రీంకోర్టు కూడా బెయిల్ నిరాకరణ :** మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి ) అరెస్టు చేసిందన్నారు. ఈ కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయంపై కూడా విచారణ జరుగుతోందని తెలిపారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని, దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన ఈడీ మరియు అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాలను కూడా వైఎస్సార్సీపీ రాజకీయ కోణంలో చూపడం విచారకరమన్నారు.

**రాజకీయ కక్ష కాదు. చట్టపరమైన చర్య :** కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరించడం పూర్తిగా అవాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. "తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షార్హులే. చట్టం ముందు అందరూ సమానమే. ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం లేదు. కానీ అవినీతి చేసిన వారిని చట్టం వదిలిపెట్టదు" అని గళ్ళా మాధవి అన్నారు.

**కులం కార్డు చూపించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం :** వైఎస్సార్సీపీ నాయకులు తమ అక్రమాలను సమర్థించుకోవడానికి ప్రతిసారీ కులం కార్డును ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. ఒక వ్యక్తి అవినీతి ఆరోపణలతో అరెస్టు అయితే దానిని బీసీలు, ఎస్సీలు, బడుగు బలహీన వర్గాలపై దాడిగా చిత్రీకరించడం దురుద్దేశపూర్వక రాజకీయమని విమర్శించారు. "అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని కేవలం అతని కులం ఆధారంగా రక్షించే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. చట్టపరమైన చర్యలను కుల కోణంలో చూడటం సరికాదు" అని అన్నారు.

**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది :** బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అత్యధికంగా కృషి చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మరియు ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో బడుగు బలహీన వర్గాలపై జరిగిన అన్యాయాలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు తమ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఆ వర్గాల పేర్లు ఉపయోగించడం సిగ్గుచేటని విమర్శించారు.

**లిక్కర్ స్కామ్ బాధిత మహిళలకు సమాధానం చెప్పాలి :** లిక్కర్ విధానాల కారణంగా వేలాది కుటుంబాలు నష్టపోయాయని, అనేక మంది మహిళలు తమ కుటుంబ పెద్దలను కోల్పోయారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ వల్ల నష్టపోయిన కుటుంబాలను పరామర్శించకుండా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని మాత్రమే పరామర్శించడం వైఎస్సార్సీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.

**పారదర్శక పాలనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక, అవినీతి రహిత పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుపరిపాలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "మీరు చేసిన పాపాలకు రాజకీయాన్ని అడ్డం పెట్టుకోవద్దు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకుని, చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలి" అని వైఎస్సార్సీపీ నాయకులకు హితవు పలికారు.

# రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం.. భర్త తీవ్ర గాయాలు



**గుంటుపల్లి, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గుంటుపల్లి సెంటర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటుపల్లి ఖాజీపేట అంజని గ్రీన్ పార్క్‌లో నందం బాలగంగాధరరావు కుటుంబం నివసిస్తోంది. సోమవారం బాలగంగాధరరావు (61) తన భార్య నిర్మల జ్యోతి (56)తో కలిసి ద్విచక్ర వాహనంపై వన్‌టౌన్‌లోని వారి బంగారు నగల దుకాణానికి పనికి బయలుదేరారు. కొద్ది నిమిషాల్లోనే గుంటుపల్లి సెంటర్‌లో వారి ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నిర్మల జ్యోతి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదంలో ఆమె తల భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలగంగాధరరావు కూడా తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిర్మల జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గుంటుపల్లి సెక్టార్ ఎస్సై సత్యవతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి సమగ్ర అభివృద్ధి

## టీడీపీ నేత రమణ మాస్టర్



**చెరుకుపల్లి, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గత రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం మరియు పారిశ్రామిక ప్రగతికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని తెలుగుదేశం పార్టీ నాయకులు రమణ మాస్టర్ స్పష్టం చేశారు. సోమవారం యేమినేనివారిపాలెంలోని 246వ బూత్ పరిధిలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ, రాష్ట్రం భవిష్యత్తులో మరింత ప్రగతిపథంలో సాగాలంటే ప్రజలంతా ఐక్యంగా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దేశ రక్షణ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## పొన్నపల్లి సత్యనారాయణ





**చెరుకుపల్లి. 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దేశ శ్రేయస్సు, ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆరంబాక, గుళ్ళపల్లి ఎస్టీ కాలనీల్లో నిర్వహించిన 'ధర్మ రక్షాబంధన్' కార్యక్రమంలో భాగంగా "నేను నీకు రక్ష – నీవు నాకు రక్ష, మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష" అనే నినాదంతో స్థానికులకు ధర్మరక్షణ కంకణాలు ధరింపజేసి, ధర్మ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. దేశంలో ధర్మం వర్ధిల్లితేనే ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని వక్తలు పేర్కొన్న ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, చింతల మురళీకృష్ణ, మాతాజీ జయంపు కమల మరియు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

## ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర సమావేశంలో తీర్మానం






**గుంటూరు, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరులోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ గణేశ ఉత్సవ సమితి రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. సమితి గౌరవ అధ్యక్షులు గోకరాజు గంగరాజు మరియు అధ్యక్షులు చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గణేశ ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య, సమితి కార్యదర్శి త్రినాథ్, లక్ష్మీపతి, గుంటూరు జిల్లా అధ్యక్షులు మల్లినేని పరమేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, గుంటూరు నగర అధ్యక్షులు పుణుగుళ్ల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. 2025 సంవత్సరంలో గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించిన మండపాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు, అవసరమైన సదుపాయాలు కల్పించడం, అవసరమైన వారికి ఉచిత విద్యుత్ సౌకర్యం అందించడం వంటి చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ గణేశ ఉత్సవ సమితి కృతజ్ఞతలు తెలిపింది. 2026లో గణేశ ఉత్సవాలను మరింత విజయవంతంగా, ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది. జిల్లాల వారీగా ముందస్తు సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. నోడల్ అధికారులను నియమించాలి. సింగిల్ విండోలో మండపాల నమోదు ముందుగానే ప్రారంభించాలి. ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలి. పారిశుద్ధ్యం, మంచినీరు, భద్రతకు ప్రాధాన్యం. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, మంచినీటి సదుపాయం, విద్యుత్, లైటింగ్, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు. క్రేన్లు, గజ ఈతగాళ్లు/శిక్షణ పొందిన సిబ్బంది, లైటింగ్, సౌండ్ సిస్టమ్, భద్రతా ఏర్పాట్లు. పవిత్ర భావంతో నిమజ్జనం మొదలైన విషయాలపై విస్తృతంగా చర్చించారు. వీటి కొరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సమావేశం తీర్మానించింది. గణేశ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, పర్యావరణం మరియు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఉత్సవ నిర్వాహకులు మరియు భక్తులు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ గణేశ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది.

# మద్యం మాఫియా డాన్ జగన్ : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 24 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మద్యం అక్రమాల వంటి దురాగతాలతో దొంగలు ముఠా నాయకుడిగా జగన్ ఎదిగారని, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దీనికి నిదర్శనమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల విషయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు అరెస్టు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరుకు రవాణాలోనూ అక్రమాలలకు ఒడిట్టారన్నారు. మద్యం విక్రయాలలో ఇష్టరీతిగా వ్యవహరించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాటారని విమర్శించారు. గంజాయి బ్యాచ్ ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమాల ద్వారా వచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్ కు చేరిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయంలో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని, గత వైసిపి పాలనలో యువత భవితను గంజాయి మత్తులో నాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టే రోజులు ముందున్నాయన్నారు.

# మాజీ మంత్రి జోగి ఆరోపణలపై ఎమ్మెల్యే వసంత స్పందన



**ఇబ్రహీంపట్నం, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** అనవసర విషయాల్లో తాను జోక్యం చేసుకునే వ్యక్తిని కాదని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి జోగి రమేష్ చేసిన ఆరోపణలపై ఇబ్రహీంపట్నంలో సోమవారం ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వసంత మీడియా ఎదుట స్పందించారు. శాసనసభ్యుల కార్యాలయానికి నిత్యం ఎంతోమంది వస్తుంటారని తెలిపారు. అదేవిధంగా మేఘన, ఆమె కుటుంబ సభ్యులు కూడా తన కార్యాలయానికి వచ్చినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావచ్చని, ఎవరైనా వెళ్లవచ్చని పేర్కొన్నారు. కుటుంబ వ్యవహారం కావడంతో ఇరు వర్గాలు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని తాను సలహా ఇచ్చినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. ఈ విషయంలో తాను ఎలాంటి జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. తన వ్యక్తిత్వం అందరికీ తెలిసిందేనని అన్నారు. అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవడం తనకు అలవాటు లేదని పేర్కొన్నారు. కుటుంబ వ్యవ హారాలను రాజకీయ అంశాలతో ముడిపెట్టకుండా సంబంధిత వ్యక్తులు మాట్లాడుకుని పరిష్కరించుకోవడం మంచిదని సూచించారు

# లవ్ జిహాద్ బాధితులకు న్యాయం చేయాలి : బీజేపీ



**గుంటూరు, 24 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు అధ్యక్షతన సోమవారం జనతా పార్టీ గుంటూరు జిల్లా కన్వీనర్ షేక్ సాంబశివరావు ఆధ్వర్యంలో లవ్ జిహాద్ బాధితులకు న్యాయం చేయాలి కలె క్టర్ కార్యాలయంలో నిర్వహించిన పి.జి.ఆర్. ఎస్ లో వినతి పత్రం ఇవటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగం గా లవ్ జిహాద్ లు సాధిక్ ఖాన్ మోస పోయిన ఏఈ కుటుంబం అలాంటి సన్నివేశాలు దేశంలో రాష్ట్రంలో జిల్లాలో జరుగు తున్నప్పటికీ అవి బయటకు రాకపోవడం మరియు పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళిన వాటిని పట్టించు కోకపోవడం వలన ఎంతోమందికి అన్యాయం జరుగు తుందని బీజేపీ నాయకులు అన్నారు. ఇలాంటి లవ్ జిహాద్ జరిగిన ప్రదేశాన్ని గుర్తించి వారికి అండగా ఉండి వారికి న్యాయం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ కి విన్నవించడం జరిగింది. ఈ జనతా వారధి కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ అబ్రహం, బిజెపి గుంటూ రు జిల్లా సెక్రెటరీ దాన బోయిన శివయ్య, 12వ మండల ఉపాధ్యక్షులు భార్గవ, కార్యకర్తలు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# నా కుటుంబాన్ని చంద్రబాబు – లోకేష్ మానసికంగా వేధించారు

## రాజీవ్, మేఘన దంపతుల వివాదంపై మాజీ మంత్రి జోగి రమేష్ స్పందన



**ఇబ్రహీంపట్నం, 24 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గత నెల రోజులుగా తాను, తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుటుంబంపై గత నెల రోజులుగా జరుగుతున్న ప్రచారం, తన కుమారుడు రాజీవ్, మేఘన మధ్య వివాదం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు తదితర అంశాలపై జోగి రమేష్ భావోద్వేగంతో స్పందించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం, చదివించడం, వారికి వివాహం చేయడం తమ బాధ్యత అన్నారు. ఆ బాధ్యతలో భాగంగానే తన కుమారుడు రాజీవ్‌కు మేఘనతో ఘనంగా వివాహం జరిపించామని తెలిపారు. అయితే రాజీవ్, మేఘన మధ్య కొన్ని మనస్పర్థలు, భేదాభిప్రాయాలు వచ్చాయని చెప్పారు. పిల్లలు కలిసి ఉండాలని తల్లిదండ్రులుగా తాము కోరుకుంటామని, విడిపోవాలని ఎప్పుడూ కోరుకోమని జోగి రమేష్ అన్నారు. 2026 జూన్ 8న తన కుమారుడు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించాడని, జూలై 24న మేఘన తన కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. విడాకుల వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందున ఈ అంశంపై తాను ఎక్కువగా మాట్లాడలేనని చెప్పారు. రాజీవ్, మేఘన మధ్య సమస్యలు వచ్చి ఉండొచ్చని, అయితే మేఘనను తమ కుటుంబం కూతురిలా చూసుకుందని తెలిపారు. కుటుంబ వివాదాన్ని వ్యక్తిగతంగా పరిష్కరించుకోవాల్సిన అంశంగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. గత నెల రోజులుగా తమ కుటుంబాన్ని మానసికంగా వేధించేలా కొన్ని కథనాలు ప్రసారం చేశారని జోగి రమేష్ ఆరోపించారు. కొన్ని ప్రసార మాధ్యమాలు తమ కుటుంబంపై వార్తలు ప్రసారం చేసి వ్యాపారం చేసుకున్నాయని విమర్శించారు. తమ కుటుంబానికి కూడా భావోద్వేగాలు, బంధాలు ఉన్నాయని పేర్కొంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబంపై మతమార్పిడికి ప్రయత్నించారంటూ ప్రచారం చేశారని ఆరోపించారు. తన భార్య బైబిల్ చదవడం తప్పా, ఏసుక్రీస్తు బోధనలు వినడం తప్పా అని ప్రశ్నించారు. తాము తిరుపతి, దుర్గగుడికి వెళ్తామని, యాగాల్లో కూడా పాల్గొంటామని తెలిపారు. తన కుటుంబాన్ని మానసికంగా వేధించి రాజకీయంగా లబ్ధి పొందడం ఏమిటని చంద్రబాబు, లోకేష్‌ను జోగి రమేష్ ప్రశ్నించారు. ఐటీడీపీ ద్వారా నెల రోజులుగా తమ కుటుంబంపై ప్రచారం చేశారని ఆరోపించారు. వ్యక్తిగత విషయాల్లోకి రావద్దని, చేతనైతే రాజకీయంగా తనపైకి రావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు పూర్తయిన రెండు నెలలకే తన కుమారు డిని అరెస్టు చేయించారని ఆరోపించారు. కల్తీ మద్యం కేసులో తనను, తన తమ్ముడిని 83 రోజులు జైలులో పెట్టారని పేర్కొన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తన ఇంటిపై దాడి చేయించారని ఆరోపించారు. ఇన్ని ఇబ్బందులు ఎదురైనా తాను భయపడలేదని, తన గొంతు నొక్కాలని ఎంత ప్రయత్నించినా వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని జోగి రమేష్ ఆరోపిం చారు. ఏ కుటుంబంలో సమస్యలు లేవో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, చిరంజీవి వంటి ప్రముఖుల కుటుం బాల్లో కూడా సమస్యలు ఉండవా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వ్యక్తిగత విషయాలపై తాను ఎప్పుడూ మాట్లాడలేదని తెలిపారు. ఎమ్మెల్యే వసంత కార్యా లయంలో రాజకీయాలు చేయడం సమంజసమేనా అని ప్రశ్నిం చారు. తాను దమ్ముగా రాజకీయాలు చేస్తానని, వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వసంత ఇలాంటి రాజకీ యాలు మానుకోవాలని సూచించారు. తనపై ఇన్ని కుట్రలు ఎందు కు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌ను జోగి రమేష్ ప్రశ్నించారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని అన్నారు. కుటుంబ వివా దాలను రాజకీయాల కోసం రోడ్డుపైకి తీసుకురావద్దని కోరారు. తాను దేనినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరు తో తన కుటుంబాన్ని ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపిం చారు. తన గొంతు నొక్కాలని ఎంతగా ప్రయత్నించినా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. మహా టీవీ వంశీని ఉద్దేశించి కూడా జోగి రమేష్ పలు వ్యాఖ్యలు చేశారు. మంత్రి లోకేష్ రెడ్ బుక్ పేరుతో విర్రవీగవద్దని జోగి రమేష్ అన్నారు. ఈరోజు రెడ్ బుక్.. రేపు డెత్ బుక్ అవుతుందని వ్యాఖ్యా నించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చి నప్పుడు అన్నింటినీ బయటపెడతానని స్పష్టం చేశారు. అధికారం ఉంటే ప్రజలకు మంచి చేయాలని, వ్యక్తిగత కుటుంబ వివాదాలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించవద్దని సూచించారు. తమ కుటుంబంపై నెల రోజులుగా వార్తలు ప్రసారం చేసిన ప్రసార మాధ్యమాలు, యూట్యూబ్ ఛానళ్ల తీరుపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. రాజకీయ పోరాటాన్ని రాజకీయంగానే ఎదుర్కోవాలని, వ్యక్తిగత కుటుంబ విషయాలను అందులోకి తీసుకురావద్దని కోరారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్ లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

**ఉద్యోగాలు నింపడంపై లేని తొందర మద్యం వ్యాపారంపై ఎందుకు?**

**మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం**

**హైదరాబాద్, ఆగస్టు 24 :** రాష్ట్రంలో లక్షలాది మంది యు వత భవిష్యత్తుకు భరోసా కల్పించే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మద్యం వ్యాపా రం కోసం మాత్రం ఆగమేఘాల మీద 121 బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చే యడం ఏందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నిరుద్యోగులకు ఉ ద్యోగాలు కల్పించడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎకువ శ్రద్ధ ఉన్నట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లికర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్‌రెడ్డి చెప్పిన ప్రజాపాలన?' అని నిలదీశారు. ప్రభుత్వ తీరుపై సోమవారం ఆయన ప్రకటనలో మండిపడ్డారు. డిగ్రీ లు, పీజీలు పూర్తిచేసిన యువత ఉ ద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే.. ప్రభు త్వం మద్యం దుకాణాలు, బ్రాండ్ల సంఖ్యను పెంచి ఆదాయం సమకూర్చుకోవడంపైనే దృష్టిపెట్టిందని విమర్శించా రు. రాజీవ్ యువవికాసం వికసించక వాడిపోయిందని, హామీలకు అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. 'రేవంత్ పగ.. యువత దగ' అన్నట్టు పరిస్థితి మారిందని విమర్శించారు.

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

**కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం**

**సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్ : పిసిసి చీఫ్**

**మెదక్,ఆగస్ట్24 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉ ంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉ న్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్

మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్ల బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# నిర్మల్‌లో ఇద్దరు, యాదాద్రిలో ఎసిబికి చిక్కిన నలుగురు

**లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఎసిబి అధికారులు**

**నిర్మాల్/యాదాద్రిభువనగిరి,ఆగస్ట్24 :** వేర్వ్వరు చోట్లు నలుగురు అధికారులు ఎసిబికి చిక్కారు. వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు పన్నుల శాఖాధికారులు ఏసీబీ కి పట్టుబడ్డారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం పన్నుల శాఖ నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు నుంచి రూ. 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్‌టీవో కొప్పెల గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయికృష్ణను ఆదిలాబాద్ రేంజ్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధిన ఆడిట్ లెక్కల వ్యవహారంలో అనుకూలంగా నివేదికను తయారు చేయాలని మంచిర్యాల పట్టణానికి చెందిన జువెల్లరి దుకాణపు యజమాని లక్కింశెట్టి వీర భాస్కర రావు ఎస్టీవో అధికారులను సంప్రదించాడు. దీంతో ఇద్దరు అధికారులు మొదల లక్ష రూపాయలు డిమాండ్ చేసి చివరకు రూ. 50వేలకు ఒప్పందం చేసుకున్నారు.అనంతరం ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ముందస్తు వ్యూహం ప్రకారం సోమవారం ఇద్దరు అధికారులను పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ ఇద్దరిని కోర్టులో హాజరుపరిచామని వెల్లడించారు. ఇకపోతే అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం ఉదయం నిర్మల్ జిల్లాలో ఇద్దరు ఏసీబీకి పట్టుబడగా యాదాద్రి జిల్లాలో మరో ఇద్దరు లంచం తీసుకుంటూ పట్టు బడ్డారు. జిల్లాలోని ఆలేరు మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వేముగంటి పూర్ణచందర్ రావు, గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఫిర్యాదుదారుడు నుంచి రూ.14 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేయ డంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదుచేశాడు. దీంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు ఫిర్యాదుదారుడు లంచం ఇస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థు నుంచి దూకిన యువతి

**హైదరాబాద్,ఆగస్ట్24 :** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

# సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం

**సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు కై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!**

**బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి**

**ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,ఆగస్టు 24 :** తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి ఉ జ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశర చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివే యడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ-అసైన్ చేసిన తాడిచర్ల-2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ -2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి ఃఉాెఒ లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రా÷ట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకు న్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిభట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల -2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉ ప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ -2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందల మంది లబ్ధిపొందారన్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అన్ని ఏరియాలకు సంబంధించిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# దేశ వ్యతిరేకుల్ని ఎలా కలుస్తారు?

**అమెరికా పర్యటనపై సీఎం సమగ్ర సమాచారం ఇవ్వలేదు**

**గతంలో వెళ్లినప్పుడు కేంద్రం అడ్డుకోలేదు కదా**

**ఫీజు బకాయిలపై రాహుల్ తెలంగాణకు వచ్చి సమాధానం చెప్పాలి**

**బకాయిలు విడుదల చేయకపోతే పోరాటం ఉధృతం**

**48 గంటల నిరాహార దీక్షలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్ :** అమెరికా పర్యటనకు వెళ్లి దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్న వారిని సీఎం రేవంత్రెడ్డి ఎందుకు కలవాలనుకు న్నారో సమాధానం చెప్పాలని చీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావు డిమాండ్ చేశారు. ప్రోటోకాల్ మేరకు ఎవరిని కలవబోతున్నది కేంద్ర విదేశాంగశాఖకు సీఎం సమాచారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. గతంలో సీఎం రేవంత్ అమెరికాకు వెళ్లారని, అప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆయన పర్యటనను నిరాకరించలేదుకదా..? అని ప్రశ్నించారు. ఈవ్యవహారంతో సీఎం రేవంత్రెడ్డి నైజం బయటపడిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చార విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టి పోయిందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్న విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశమంతా తిరుగుతూ చీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొట్టడం కాదని, దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వంఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్మెంట్పై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఎందుకు ఇవ్వడం లేదో, స్కాలర్షిప్లు ఎందుకు అందడం లేదో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫీజుల ఐకాయి.. వీజేపీ లడాయి పేరుతో చేపట్టిన 48 గంటల నిరాహారదీక్షను సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఎం బిఆర్ఎస్ ప్రభుత్వం ఆదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ. 4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని దుయ్యబట్టారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, ఇందుకు బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయబ "పోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపో తున్నాయని, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తు న్నాయన్నారు. యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్ర భుత్వం మోసం చేస్తోందని దుయ్యబట్టారు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్ గా రూ.2 వేల




కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ఉ స్మానియా యూనివర్సిటీరి ఇస్తామన్న రూ.1,000 కోట్లను ఇప్పటి వరకు ఇవ్వలేదని, పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే లాఠీచార్జ్ చేయించిందని మండిపడ్డారు. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు సైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్ర భుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ పోరాటం ఆగదని ప్రకటించారు."

# మాజీమంత్రి కారుమూరి అరెస్ట్

**ఎపి లిక్కర్ కేసులో అదుపులోకి తీసుకున్న ఇడి**

**కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలింపు**

హైదరాబాద్,ఆగస్టు 24 : ఏపీ లిక్కర్ రవాణా స్కాం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి ఈడీ కోర్టు రిమాండ్ విధించింది. ఆదివారం కారుమూరిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన్ను నాంపల్లి ఈడీ కోర్టులో హాజరుపరచగా.. కేసుకు సంబంధించి ఈడీ అధికారులు తమ వాదనలు వినిపించారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలను కోర్టుకు వివరించిన ఈడీ.. కారుమూరి నాగేశ్వరరావు పాత్రపై మరింత విచారణ అవసరమని పేర్కొన్నట్లు సమాచారం. ఈడీ వాదనలతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు.. కారుమూరికి సెప్టెంబర్ 7 వరకూ రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్ ఆదేశాల అనంతరం కారుమూరి నాగేశ్వరరావును చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏపీ లిక్కర్ రవాణా స్కాం కేసులో ఇప్పటికే దర్యాప్తు కొనసాగిస్తున్న ఈడీ.. ఆర్థిక లావాదేవీలు, అక్రమ రవాణాకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో కారుమూరి అరెస్టు కావడం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండనున్నారు. సెప్టెంబర్ 7 వరకూ రిమాండ్ విధించిన నేపథ్యంలో.. ఈ వ్యవహారంలో తదుపరి దర్యాప్తు, ఈడీ తీసుకునే చర్యలపై ఉత్కంఠ నెలకొంది.

# ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

**ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు**

**టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు**

**మక్కా ఒప్పందలోకి ఇరాన్‌కు ఆహ్వానం**



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్‌క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.

ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్ ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది. మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్ కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్దీ రహీమి పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. నాటో కూటమి మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇరాన్ ఈ ఒప్పందంలో చేరితే.. హూతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ ఆహ్వానం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

## హర్యానాలో దిగ్భ్రాంతికర ఘటన

**భర్తను చంపి పేగులూడదీసిన భార్య**

**చండీఘడ్:** హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన ఒక దిగ్భ్రాంతికర హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ఒక మహిళ తన భర్తను చంపి, అతడి పేగులు బయటకు తీసి దారుణానికి పాల్పడింది. ఆ తర్వాత ఇంటి యజమాని చూశాడనే భయంతో భయాందోళనకు గురై ఇంటి పైకప్పు మీది నుంచి కిందకు దూకేసింది. ప్రస్తుతం ఆమె హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. కురుక్షేత్రలోని పెహోవా రోడ్డులో ఉన్న రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేష్, విమలా దేవి ఓ అ÷-దదె ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల రాజేష్, విమలా దేవి ఏదో విషయమై గొడవపడ్డారు. ఆ గందరగోళాన్ని విని ఇంటి యజమాని రింకు డాబా మీదకు పరుగెత్తాడు. అక్కడ అతడు చూసిన దృశ్యం అచ్చం క్రైమ్ సినిమాలోని సన్నివేశంలా ఉంది. రాజేష్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడి శరీరం నుంచి బయటకు వచ్చిన పేగులను విమల ఒక సంచిలో పెడుతోంది. ఇంటి యజమానిని చూడగానే ఆ మహిళ భయాందోళనకు గురైంది. వెంటనే టెర్రస్ పై నుంచి కిందకు దూకేసింది. గాయపడిన నిందితురాలిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోంది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పదునైన ఆయుధాలతో రాజేష్ పొట్టను సుమారు 35 సెంటీమీటర్ల మేర కోసి, లోతైన గాయాలు చేసినట్లు పోస్ట్‌మార్టంలో తెలిసింది. ఘటనా స్థలం నుంచి మూడు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

**ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన**

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి

**ప్రాథమికి సౌకర్యా కూడా మృగ్యం**

**ఇలా అయితే యువత ఎలా చదువు సాగిస్తుంది**

**మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజిత్ దీప్కే లేఖ**

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు. ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్యశాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# మహిళలకు తమిళ సీఎం విజయ్ వరాలు

**ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన**

**ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం**

చెన్నై,ఆగస్ట్24 : తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

## వెంటిలేటర్ పేలి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

**ముగ్గురు నవజాత శిశువుల మృతి**

**ముంబై:** మహారాష్ట్రలోని అమరావతిలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. అమరావతి జిల్లా మహిళా ఆస్పత్రిలో మంటలు చెలరేగి ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 39 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అయితే, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి. నిమిషాల్లో ఎల్ఎన్సీయూ మొత్తం వ్యాపించాయి. దీంతో పొగ పీల్చడం, తీవ్రమైన కాలిన గాయాలు కారణంగా ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైద్యులు, నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వార్డుకు చేరుకుని చిన్నారులను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు నవజాత శిశువులను చికిత్స నిమిత్తం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

**ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం**

**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**

**న్యూఢిల్లీ:** అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

**యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన**

**వాషింగ్టన్,ఆగస్ట్24 :** ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లూ ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## గినియాలో కూలిన డంపింగ్ యార్డు

**ప్రమాదంలో 30 మంది దుర్మరణం**

**న్యూఢిల్లీ,ఆగస్ట్2 4:** పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి. గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటివరకు 18 మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమానంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకాశమున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.

## మహారాష్ట్రలో మరో వైద్యుడిపై దాడి కలకలం

**రోగిని పరీక్షస్తుండగా కుమారుడి దాడి**

**ముంబై,ఆగస్ట్24 :** మహారాష్ట్రలో వైద్యుడిపై దాడి మరోసారి కలకలం రేపింది. థానేలోని కల్యాణ్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడిపై అతని కుమారుడు దాడికి పాల్పడ్డాడు. డాక్టర్‌ను దుర్భాషలాడుతూ కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ మహిళా వైద్యురాలితో పాటు ఆస్పత్రి సిబ్బందిపై శివసేన కార్పొరేటర్ రమేశ్, అతని అనుచరులు దాడికి పాల్పడటం తెలిసిందే. ఆ దాడి సంచలనం సృష్టించిన కొన్ని రోజులకే తాజాగా మరో ఘటన జరగడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో దేశ్‌ముఖ్ అనే రోగిని ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ యోగేంద్ర జైస్వాల్ పరీక్షిస్తున్నారు. అతని పక్కటెముకకు గాయం కావడంతో చికిత్సా విధానం, బ్యాండేజ్ ఎలా వేయాలి, మందులు ఎలా వాడాలనే విషయాలను జైస్వాల్ వివరిస్తున్నారు. ఈ సమయంలో రోగి కుమారుడు ఒకే ప్రశ్నను పదేపదే అడుగుతూ అభ్యంతరకర భాషను ఉపయోగించాడు. దీనిపై డాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో 'నువ్వేమైనా పెద్ద డాక్టరువా?' అంటూ రోగి కుమారుడు ప్రశ్నించినట్లు జైస్వాల్ వెల్లడించారు. అనంతరం బయటకు వెళ్లి తనను దూషించాడని, తాను అభ్యంతరం చెప్పడంతో తిరిగి వచ్చి దాడి చేశాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదు. ఇటీవలే డొంబివ్లిలోనూ ఓ వైద్యురాలిపై దాడి ఘటన కలకలం రేపింది. కల్యాణ్-డొంబివ్లి ప్రాంతానికి చెందిన శివసేన కార్పొరేటర్ రమేశ్.. ఓ మహిళా వైద్యురాలిపై దాడి చేయడం సంచలనమైంది. కార్పొరేటర్, ఆయన అనుచరులు ఆస్పత్రి సిబ్బందిపైనా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వరుస దాడులతో వైద్యుల్లో ఆందోళన నెలకొంది. తమకు భద్రత కల్పించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.

# రెండో టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యం

**ఆట కాసేపట్లో ముగుస్తుందనగా..**

**రెండు వికెట్లు తీసి లంకను దెబ్బకొట్టిన భారత్**

**ధ్రువ్ జురెల్ అజేయ సెంచరీతో చెలరేగిన వేళ**

**రిషభ్ పంత్ దూకుడైన అర్ధశతకంతో మెరుపులు**

**503 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత్**

**రెండో రోజు ఆట ముగిసేసరికి 8/2 స్కోరుతో శ్రీలంక కష్టాల్లో**

**495 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచిన టీమిండియా**




కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (115 నాటౌట్) అద్భుత శతకంతో కదంతొక్కగా, రిషభ్ పంత్ (63) తనదైన శైలిలో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం, వెలుతురు మందగిం చిన పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను భారత బౌలర్లు దెబ్బకొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి లంక కేవలం మూడు ఓవర్లలో 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్రస్తుతం భారత్ కంటే 495 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు, రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్‌ను లంక పేసర్ అసిత్ ఫెర్నాండో తన పదునైన బౌన్సర్‌తో బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్, నిలకడగా ఆడుతున్న జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. తొలి రోజు గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. తిరిగొచ్చాక లంక బౌలర్ల షార్ట్ బాల్ వ్యూహాన్ని సమర్థంగా ఎదుర్కొన్నాడు. తనదైన విధ్వంసక శైలిలో ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలో లహిరు కుమార బౌలింగ్‌లో అతను కొట్టిన ఒక భారీ సిక్సర్ స్టేడియం పైకప్పును దాటి, సోలార్ ప్యానెల్‌ను ధ్వంసం చేసింది. దీంతో బంతిని మార్చాల్సి వచ్చింది.

పంత్ దూకుడుకు జురెల్ నిలకడ తోడవడంతో భారత్ లంచ్ సమయానికి పటిష్ఠ స్థితిలో నిలిచింది. పంత్ 21వ టెస్టు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, జురెల్ తన మూడో అర్ధశతకాన్ని నమోదు చేశాడు. అయితే, లంచ్ విరామం తర్వాత తొలి బంతికే పంత్ అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మానవ్ సుతార్‌తో కలిసి జురెల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.

వర్షం కారణంగా సుమారు రెండు గంటల పాటు ఆట నిలిచిపోయినప్పటికీ, జురెల్ ఏకాగ్రత కోల్పోలేదు. ఆట పునఃప్రారంభమైన తర్వాత ఫెర్నాండో బౌలింగ్‌లో అద్భుతమైన డ్రైవ్‌తో పరుగు పూర్తి చేసి తన రెండో టెస్టు సెంచరీని అందుకున్నాడు. శ్రీలంక గడ్డపై అతనికి ఇదే తొలి శతకం. సెంచరీ పూర్తి కాగానే అతను తన చేతిపై ఉన్న 'జై జవాన్, జై కిసాన్' అనే టాటూను ప్రదర్శిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడి జట్టు స్కోరును 500 పరుగులు దాటించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెంటనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి లంక బ్యాటర్లను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. వెలుతురు మందగిస్తున్న క్లిష్ట సమయంలో బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకను భారత బౌలర్లు వెంటనే దెబ్బకొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణ తన రెండో బంతికే లహిరు ఉడార (1)ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత చివరి ఓవర్ చివరి బంతికి మానవ్ సుతార్.. నైట్ వాచ్‌మెన్ ప్రభాత్ జయసూర్యను ఎల్బీడబ్ల్యూగా వెనక్కు పంపాడు. దీంతో అంపైర్లు వెలుతురు లేమి కారణంగా రెండో రోజు ఆటను నిలిపివేశారు. ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి పట్టు సాధించి విజయానికి బలమైన పునాది వేసుకుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ తొలి ఇన్నింగ్స్: 503/9 డిక్లేర్డ్ (దేవదత్ పడిక్కల్ 117, ధ్రువ్ జురెల్ 115లి; అసిత్ ఫెర్నాండో 4/106)

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 8/2 (ప్రసిద్ధ్ కృష్ణ 1/1, మానవ్ సుతార్ 1/6)

# మైదానంలో గొడవ.. జైస్వాల్, ఫెర్నాండోపై ఐసీసీ కఠిన చర్యలు




రెండో టెస్టు తొలి రోజే మైదానంలో చోటుచేసుకున్న వివాదంపై ఐసీసీ చర్యలు తీసుకుంది. భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోకు జరిమానా విధించింది. ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ నిర్ణయం తీసుకుంది. చెరో డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది.

**ఏం జరిగిందంటే..**

'సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్' మైదానంలో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజున 17వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. ఫెర్నాండో వేసిన బంతికి జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో బౌలర్ ఏదో అన్నట్లు జైస్వాల్ భావించాడు. దీంతో తిరిగి వచ్చి ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ దాదాపు తలలు తాకించుకున్నారు. వెంటనే సహచరులు జోక్యం చేసుకుని వారిని విడదీశారు.

**ఐసీసీ నిబంధన ఉల్లంఘన**

ఇద్దరూ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు తేలింది. అంతర్జాతీయ మ్యాచ్‌లో ఆటగాడు, సహాయక సిబ్బంది, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచితంగా శారీరకంగా వ్యవహరించడాన్ని ఈ నిబంధన తప్పుబడుతుంది. మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ఈ శిక్షలను ప్రతిపాదించారు. జైస్వాల్, ఫెర్నాండో తప్పును అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే చర్యలు ఖరారయ్యాయి. గత 24 నెలల్లో ఇద్దరికీ డీమెరిట్ పాయింట్లు లేకపోవడం గమనార్హం.

**జైస్వాల్‌కు భోగ్లే సూచన**

జైస్వాల్ తీరుపై క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందించారు. ఔటైన తర్వాత జైస్వాల్ నేరుగా వెళ్లిపోవాల్సిందని సూచించారు. దీనిపై జైస్వాల్ ఘాటుగా స్పందించాడు. ఏం జరిగిందో తెలియకుండా తీర్పు ఇవ్వొద్దని కోరాడు. ఎవరైనా హద్దులు దాటితే భారత్ పోరాడుతుందని పేర్కొన్నాడు.

**కోటక్ ఏమన్నారంటే..**

భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కూడా ఘటనపై స్పందించారు. ఆ సమయంలో భావోద్వేగాలు అదుపు తప్పి ఉండొచ్చన్నారు. అయితే ఫెర్నాండోకు అంత దగ్గరగా వెళ్లి శారీరకంగా తాకడం జైస్వాల్ చేయకూడదని స్పష్టం చేశారు.

# రిషభ్ పంత్ సరికొత్త చరిత్ర

**ధోనీ రికార్డు బద్దలు**


భారత యువ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. విదేశీ గడ్డపై లేదా తటస్థ వేదికలపై జరిగిన టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉండగా, శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో పంత్ ఆ రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌కు ముందు ధోనీ 2,496 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా, పంత్ తాజా ఇన్నింగ్స్‌తో 2,501 పరుగుల మైలురాయిని చేరుకుని ధోనీని వెనక్కి నెట్టాడు. దూకుడైన బ్యాటింగ్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పంత్, అతి తక్కువ సమయంలోనే ఈ ఘనత సాధించడం విశేషం. ఈ జాబితాలో ధోనీ, పంత్ తర్వాత ఫరూఖ్ ఇంజనీర్ (1,209), సయ్యద్ కిర్మాణీ (1,109), కిరణ్ మోరే (901) వంటి దిగ్గజాలు చాలా వెనుకబడి ఉండటం గమనార్హం. ఇదే



మ్యాచ్‌లో పంత్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 100 సిక్సర్ల క్లబ్‌లో చేరిన మూడో ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం పంత్ ఖాతాలో 101 సిక్సర్లు ఉన్నాయి. తనదైన దూకుడుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే పంత్, టెస్టుల్లోనూ వన్డే తరహా ఆటతీరుతో జట్టుకు కీలక విజయాలు అందిస్తున్నాడు. ఈ రికార్డులతో భారత టెస్ట్ క్రికెట్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ప్రస్తుతం టీమిండియా, శ్రీలంక మధ్య రెండో టెస్టులో రెండో రోజు ఆట కొనసాగుతోంది. భారత్ తొలి ఇన్నింగ్స్ లో 6 వికెట్లకు 376 పరుగులతో ఆడుతోంది. పంత్ 39, ధ్రువ్ జురెల్ 40 పరుగులతో క్రీజులో ఉన్నారు. నిన్న తొలి రోజు ఆటలో పంత్ గాయపడడంతో ఇవాళ ఆడడంపై అనిశ్చితి నెలకొంది. అయితే, పంత్ బరిలో దిగడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

## శ్రీలంక లాంటి జట్లపై గెలిస్తే గంభీర్ ఎగిరి గంతేస్తాడు: శ్రీకాంత్

శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తూ తొలి మ్యాచ్ గెలవడంతో పాటు, రెండో టెస్టులోనూ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. మరోవైపు వన్‌డౌన్‌లో దేవదత్ పడిక్కల్ వరుసగా రెండో సెంచరీతో అదరగొట్టాడు. అయితే, ఈ ప్రస్తుత పరిస్థితిపై టీమిండియా మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. శ్రీలంక సిరీస్‌లో కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు పెద్దగా వ్యూహాలు రచించాల్సిన పని లేదని శ్రీకాంత్ ఎద్దేవా చేశాడు. శ్రీలంక జట్టు చాలా బలహీనంగా ఉందని, వారిపై భారత్ సునాయాసంగా గెలుస్తుందని అభిప్రాయపడ్డాడు. అఫ్ఘనిస్థాన్, శ్రీలంక వంటి చిన్న జట్లపై సిరీస్‌లు గెలిచిన తర్వాత గంభీర్ ఎగిరి గంతేస్తాడని అన్నాడు. అంతేకాకుండా, నంబర్ 3 స్థానంలో గాయపడిన సాయి సుదర్శన్ తిరిగొస్తే దేవదత్ పడిక్కల్‌ను పక్కన పెడతారనే ప్రచారంపై కూడా శ్రీకాంత్ ఘాటుగా స్పందించాడు. రెండు టెస్టుల్లో కలిపి 200 పైచిలుకు పరుగులు సాధించిన ఆటగాడిని ఎలా తప్పిస్తారని ప్రశ్నించాడు. గంభీర్‌పై తనకు వ్యక్తిగత కక్ష లేదని, అతడు ఆటను బాగా అర్థం చేసుకునే వ్యక్తి అని చెప్పాడు. అయితే మీడియాతో మాట్లడేటప్పుడు ఇంకాస్త ఉత్తమంగా మాట్లాడితే బాగుంటుందని సూచించాడు.






# వారణాసిపై మరో సంచలన వార్త

## వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ అర్టిస్టులు


దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది.'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ పక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.

# 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి

రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. ÷–లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.




# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం




బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది.క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.



# యూత్ వర్సెస్ కంగనా

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకున్న కంగనా రనౌత్ సినిమాల కంటే వివాదాస్పద వ్యాఖ్యలతోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో జెన్ జీ యువత ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా కంగన కామెంట్లు తీవ్ర చర్చకు దారి తీస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేటి ఆధునిక యూత్‌కు, కంగనాకు మధ్య నడుస్తున్న సైద్ధాంతిక ఘర్షణ కంగన సినిమా కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారుతోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో యాక్టివ్‌గా ఉండే నేటి యువతరం సెలబ్రిటీల వ్యక్తిగత అభిప్రాయాలను .. వారి సోషల్ మీడియా పోస్టులను ఎప్పటికప్పుడు గమనిస్తుంటుంది. అయితే కంగనా రనౌత్ తరచూ సామాజిక, రాజకీయ అంశాలపై విసురుతున్న కామెంట్లు యువతలో ఆమెపై వ్యతిరేకత తీసుకొస్తున్నాయన్నది వాస్తవం. జెన్ జీ వర్గాల భావజాలానికి, కంగనా ఆలోచనా ధోరణికి ఎక్కడా పొంతన కుదరకపోవడంతో ఆటోమేటిక్‌గా సోషల్ మీడియాలో ఆమెకు వ్యతిరేకంగా ఒక వర్గం గళం విప్పుతోంది. ఈ వ్యతిరేకత ప్రభావం కంగన వృత్తిపరమైన జీవితంపై పడే అవకాశం ఉందనేది ట్రేడ్ వర్గాల అంచనా. కంగనా నుంచి గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ రాలేదనే చెప్పాలి. ముఖ్యంగా ఆమెపై ఈ తరహా వ్యతిరేకత మొదలైన తర్వాత కంగన ప్రధాన పాత్రలో నటించిన ఏ పెద్ద సినిమా కూడా బాక్సాఫీస్ ముందుకు రాలేదు. దీంతో త్వరలో ఆమె నటించే లేదా నిర్మించే కొత్త సినిమాలు విడుదలయ్యే సమయానికి -బాయ్‌కాట్ కంగనా- అంశం మళ్లీ తెరపైకి వచ్చే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342